వ్యవ'సాయం' అందేనా?

- పెట్టుబడి సాయం కోసం అన్నదాతల ఎదురుచూపు
- ఏడాదికి రూ.20వేలు ఇస్తామన్న చంద్రబాబు
- ఇంకా ప్రకటించని కొత్త ప్రభుత్వం
- ఇప్పటికే పీఎం కిసాన్ నిధుల జమ
- గత ప్రభుత్వంలో పీఎం కిసాన్‌తో పాటే రైతు భరోసా


విత్తనాలు విత్తుతున్న వ్యవసాయ కూలీలు

సీతారామపురం: అడపాదడపా కురుస్తున్న వర్షాలతో రైతులు ఖరీఫ్ పంటల సాగుకు సమాయత్తమయ్యారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏటా సీజన్ ఆరంభంలోనే రైతులకు పెట్టుబడి సాయంగా వైఎస్సార్ రైతుభరోసా నగదును క్రమం తప్పకుండా అందించింది. కొత్తగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వం ఇంతవరకు ఆ దిశగా అడుగులు వేయలేదు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకానికి సంబంధించిన తొలి విడత సాయం రూ.2 వేలు రైతుల ఖాతాల్లో పడింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి సాయంపై ఊసే లేదు. వాస్తవానికి మే నెలలోనే రైతుభరోసా నగదు రూ.5,500 ఇవ్వాల్సి ఉండగా, ఎన్నికల కోడ్ అమలుతో అది కాస్త ఆగిపోయింది. పీఎం కిసాన్ నగదు దుక్కులు, విత్తనాలు, కూలీల ఖర్చులకు కాస్త ఉపయోగపడింది. ఎరువులు, పురుగు మందులకు రైతులు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ సాయం కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు.

నాడు సాగు ఆరంభంలోనే ..

పంటల సాగుకు పెట్టుబడి కోసం రైతులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాగు ఆరంభంలోనే పెట్టుబడి సాయాన్ని అందిస్తూ వారికి అండగా నిలిచింది. పీఎం కిసాన్ సాయం రూ.6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా రూ.7,500 కలిపి ఏటా రూ.13,500 మూడు విడతలుగా రైతులకు అందేది. ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలో సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు, మర్రిపాడు మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లోని 23,480 మంది రైతులకు ఏడాదికి రూ.31.69 కోట్లు అందించేవారు. భూ యజమానులతో పాటు ఎలాంటి భూమిలేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు రైతులతో పాటు దేవాదాయ, అటవీ, వక్ఫ్‌బోర్డు భూములు సాగుచేసే రైతులకు రైతు భరోసా సాయం కింద పెట్టుబడి సాయం అందేది.

రాష్ట్ర సాయం కోసం ఎదురుచూపులు

ప్రస్తుతం ఉదయగిరి సబ్‌డివిజన్ పరిధిలోని పత్తి, సజ్జ, వేరుశనగ వంటి పంటలను సాగుచేసేందుకు పనులు ప్రారంభించారు. ఈ పంటల సాగుకు ఎకరాకు రూ.12వేల నుంచి రూ.15 వేల వరకు పెట్టుబడి అవసరం. గతంలో పీఎం కిసాన్‌తో పాటు రైతుభరోసా నగదు ఒకేసారి అందుతుండడంతో పెట్టుబడికి ఉపయోగపడేది. ఇప్పుడు పీఎం కిసాన్ రూ.2 వేలు మాత్రమే అందడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందజేస్తామని టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచి నెలరోజులు గడిచినా రైతు పెట్టుబడి సాయంపై ఇంత వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో సాగు ఖర్చులకు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని అన్నదాతలు వాపోతున్నారు.

అప్పు చేసి పంట సాగు



అప్పు చేసి పంటసాగును ప్రారంభిస్తున్నాం. ఎకరా సాగుకు సుమారు రూ.15 వేలు పెట్టుబడి అవసరం. గతంలో పీఎం కిసాన్‌తో పాటు రైతుభరోసా ఒకేసారి వస్తుండడంతో పెట్టుబడికి కాస్త ఊరట కలిగేది. ఇప్పుడు పీఎం కిసాన్ రూ.2 వేలు మాత్రమే అందడంతో పంట సాగుకు అప్పు చేయాల్సి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెట్టుబడి సాయం అందిస్తే బాగుంటుంది.

– ఖాజావలి,రైతు, అయ్యవారిపల్లి

క్లుప్తంగా

బీసీజీ వ్యాక్సినేషన్

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట పీహెచ్‌సీ పరిధిలో గురు, శుక్రవారాల్లో బీసీజీ వ్యాక్సినేషన్‌ను ముమ్మరంగా చేపట్టారు. వైద్యాఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి వ్యాక్సిన్లు వేసినట్లు పీహెచ్‌సీ వైద్యులు మంజుల తెలిపారు. ప్రభుత్వం క్షయ నివారణకు వయోజనులకు బీసీజీ వ్యాక్సినేషన్లు వేస్తోందని చెప్పారు. బీసీజీ వ్యాక్సిన్ వల్ల ఇబ్బంది ఉండదని తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు

వరికుంటపాడు: మండలంలోని వేంపాడులో 104 వాహనం ద్వారా ఫ్యామిలీ డాక్టర్ సేవలను శుక్రవారం అందజేశారు. వైద్యాధికారిణి ఆయేషా 40 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం కీటకజనిత వ్యాధులపై అవగాహన కల్పించారు.

పశు పోషణపై అవగాహన

సీతారామపురం: పశు పోషణ, వాటి ఆరోగ్యంపై పాడిరైతులు అవగాహన కలిగి ఉండాలని పశు వైద్యాధికారిణి అనూష సూచించారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా పబ్బులేటిపల్లి రైతు సేవా కేంద్రంలో పశు పోషణపై పాడిరైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. పాడి పశువులకు పశుగ్రాసంతో పాటు ఖనిజ లవణాల మిశ్రమం, తౌడు వంటి పదార్థాలను దాణాగా ఇవ్వడం వల్ల అధిక పాల దిగుబడి పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం సబ్సిడీపై అందజేసే గడ్డి విత్తనాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఖనిజ లవణాల మిశ్రమం, బీకాంప్లెక్స్ సిరప్‌లను రైతులకు అందజేశారు. సర్పంచ్ ఆదెయ్య, రైతుసేవా కేంద్రం సిబ్బంది మహేశ్వరి, గౌస్, నరేష్ పాల్గొన్నారు.

మర్రిపాడు: మర్రిపాడులోని గ్రామ సచివాలయంలో పశుసంవర్ధక శాఖ ఏడీ గురుజయంతి ఆధ్వర్యంలో పశుగ్రాస వారోత్సవాలను నిర్వహించారు. పాడి రైతులకు పశుగ్రాసం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. పాడి రైతులకు సబ్సిడీపై ఐదు కిలోల మొక్కజొన్న విత్తనాలు రూ.85, జొన్న విత్తనాలు రూ.115కు అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మొక్కజొన్న, జొన్న విత్తనాలను పంపిణీ చేశారు.

స్టూడెంట్ కిట్ల పరిశీలన



కలిగిరి: కలిగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని స్టూడెంట్ కిట్ల స్టాక్ పాయింట్‌ను రాష్ట్ర పరిశీలకులు శారదాకుమారి శుక్రవారం పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. అనంతరం ఆదర్శ పాఠశాలను సందర్శించారు. ఆమె వెంట సీఎంఓ పెంచలయ్య, ఎంఈఓ సురేష్‌బాబు, ఉపాధ్యాయులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల ప్రతిష్ట



సీతారామపురం: మొహర్రం సందర్భంగా మండలంలోని సీతారామపురం, ఎగువపాళెం, నారాయణప్పపేట, అయ్యవారిపల్లి, తదితర గ్రామాల్లోని పీర్ల చావిడిల్లో శుక్రవారం పీర్లను ప్రతిష్ఠించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సంప్రదాయంలో భాగంగా సీతారామపురంలోని కోటవీధిలో ఉన్న పీర్లచావిడి వద్ద నుంచి సర్కారు పీరును మేళతాళాలు, తప్పెట్ల నడుమ ఊరేగింపుగా పోలీస్‌స్టేషన్ వద్దకు తీసుకెళ్లి చదివింపుల కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై అనూషతో పాటు పోలీసు సిబ్బంది ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సర్కారు పీరును పీర్లచావిడి వద్దకు తీసుకెళ్లి ప్రతిష్ఠించారు.

డీబీఎస్ విద్యార్థుల ప్రతిభ

కావలి : పాలిటెక్నిక్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని డీబీఎస్ కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు తెలిపారు. శుక్రవారం డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈఈఈ విభాగంలో కే అభిలాష్ 9.13, ఈసీఈ విభాగంలో ఎస్‌కే జాకీర్ 8.24, సీఎస్ఈ విభాగంలో పూజశ్రీ 7.9, సీహెచ్ అరుణ్ 7.7 జీపీఏతో టాపర్లుగా నిలిచారని వివరించారు. పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ పీ శ్యామ్‌సుందర్, పరిపాలన అధికారి రమేష్ బాబు, పరీక్ష విభాగాధిపతి ఎన్‌వీ కిషోర్, అధ్యాపకులు, పాల్గొన్నారు.

జంప్‌రోప్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



కావలి : రాష్ట్రస్థాయి జంప్‌రోప్ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపికను కావలిలో శుక్రవారం నిర్వహించారు. జంప్‌రోప్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మురళి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపికలకు సుమారు 60 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కావలి, బోగోలు, వింజమూరు, కలిగిరి మండలాల నుంచి హాజరైన క్రీడాకారుల్లో ప్రతిభకనబర్చిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. వీరు ఈ నెల 27, 28 తేదీల్లో నంద్యాల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలు పాల్గొంటారని చెప్పారు. పీడీలు, పీఈటీలు చిరంజీవి,శివకుమార్‌రెడ్డి, చంద్రిక పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్ర జయప్రదానికి పిలుపు


హనుమాన్ శోభాయాత్రపై ప్రచారం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

ఆత్మకూరు: గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 21న పట్టణంలో చేపడుతున్న హనుమాన్ శోభాయాత్రలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు. పట్టణంలో హనుమాన్ శోభాయాత్రపై శుక్రవారం వారు ప్రచారం నిర్వహించారు. కళాశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయులను కలుసుకుని శోభాయాత్రలో పాల్గొనాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సీతారామలక్ష్మణులతో పాటు ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ తరలింపు


ఇసుకలో ఏర్పడిన వాహనాల టైర్ల గుర్తులు

ఆత్మకూరు: టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పచ్చ నేతలు బరితెగిస్తున్నారు. ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం సమీపంలో నెల్లూరు–ముంబయి జాతీయ రహదారి పక్కన గత ప్రభుత్వ హయాంలో ఇసుక డంపింగ్ యార్డును ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో ఇసుక కొరత తలెత్తకుండా టన్నుల కొద్దీ నిల్వ ఉంచారు. అందులో కొంత జగనన్న ఇళ్ల నిర్మాణాలకు సరఫరా చేయగా, ఇంకా సుమారు వెయ్యి ట్రాక్టర్ ట్రక్కులకు సరిపడా ఇసుక నిల్వ ఉంది. దీనిపై కన్నేసిన నెల్లూరుపాళేనికి చెందిన ఇద్దరు టీడీపీ నాయకులు తమ ట్రాక్టర్ల ద్వారా రాత్రి వేళల్లో అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గత వారం రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా ఇసుకను తరలిస్తున్నారు. సెబ్ అధికారులకు విషయం తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై సెబ్ ఎస్సై కిరణ్‌కుమార్‌ను సంప్రదించగా అక్కడ ఇసుక ఉన్న విషయం తమకు ఇటీవలే తెలిసిందని, ఏ మేరకు నిల్వ ఉండేది మైనింగ్ అధికారులకు నివేదిస్తామని చెప్పుకొచ్చారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు


మాట్లాడుతున్న తహసీల్దార్

చేజర్ల: ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. మండలాధికారులు శాఖల వారీగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ విద్యుత్, తాగునీటి సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ గోపీకృష్ణ, ఎంపీడీఓ విజయలలిత, ఎంపీటీసీలు తిరుపతినాయుడు, గుమ్మా భారతి, కృష్ణారెడ్డి, షేక్ మస్తాన్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర బీమా పథకాలపై అవగాహన కల్పించాలి


అవగాహన కల్పిస్తున్న లీడ్ బ్యాంకు మేనేజర్ ప్రదీప్‌కుమార్

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలపై పేదలకు విస్తృతంగా అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ టీఎస్ ప్రదీప్‌కుమార్ మెప్మా ఆర్పీలను కోరారు. మున్సిపల్ కార్యాలయంలో మెప్మా సిబ్బందితో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. పీఎంజేబీవై కింద రూ.20 ప్రీమియంతో 18 నుంచి 70 ఏళ్లలోపు వారికి రూ.2 లక్షల ప్రమాద బీమా అందిస్తోందని వివరించారు. పీఎంఎస్‌బీవై కింద రూ.436 ప్రీమియంతో ప్రమాదవశాత్తు లేదా సహజంగా మరణించిన రూ.2 లక్షల వరకు బీమా అందిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో బీఎల్ సురేంద్ర, మెప్మా ఐబీ అంకయ్య, సీఓ మాధవి, ఆర్పీలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ బహిరంగ సభ


విచారణ జరుపుతున్న అధికారులు

సోమశిల: అనంతసాగరం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ బహిరంగ సభను ఏపీఓ దయాసాగర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.12 కోట్ల ఉపాధి పనులు చేపట్టినట్లు తెలిపారు. అందులో కూలీలకు రూ.10కోట్లు, మెటీరియల్‌కు రూ.2కోట్లు అందచేసినట్లు వివరించారు. అనంతరం సామాజిక తనిఖీ బృందాలు గుర్తించిన అవకతవకలపై చర్చించారు. అడిషనల్ పీడీ వరలక్ష్మి, ఎంపీడీఓ తాజ్‌మన్సూర్, ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, ఏపీడీలు ఖాదర్‌బాషా, శంకర్, డీవీఓ శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, స్టేట్ క్వాలిటీ కంట్రోలర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కలిగిరి: విద్యుత్‌లైన్ల మరమ్మతుల దృష్ట్యా మండలంలోని కలిగిరి, చిన్నఅన్నలూరు, నాగిరెడ్డిపాళెం, అయ్యప్పరెడ్డిపాళెం, అనంతపురం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని విద్యుత్ శాఖ ఏఈ దినేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు.

కొండాపురం : విద్యుత్‌లైన్ల మరమ్మతుల దృష్ట్యా మండలంలోని కొమ్మి, గొట్టిగుండాల, కొండాపురం, తూర్పుయర్రబల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని ఇన్‌చార్జి ఏఈ దినేష్ తెలిపారు.

సంగం: విద్యుత్‌లైన్ల మరమ్మతుల దృష్ట్యా సంగంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులరెడ్డి శుక్రవారం తెలిపారు.

పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలి

బిట్రగుంట: రైల్వే కార్మికులకు తీవ్ర నష్టం కలిగించే కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ బిట్రగుంట శాఖ ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మజ్దూర్ యూనియన్ బిట్రగుంట శాఖ చైర్మన్ మద్దిబోయిన వెంకటశేఖర్, కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వర్లు, తదితరులు మాట్లాడుతూ రైల్వే కార్మికుల హక్కులకు భంగం కలిగించేలా, ఆర్థిక ప్రయోజనాలు దెబ్బతీసేలా ఉన్న నూతన పెన్షన్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్నే కొసాగించి కార్మికులకు భరోసా కల్పించాలని కోరారు. రైల్వేలో అడ్డగోలు ప్రైవేటీకరణకు వెంటనే స్వస్తి పలకాలని విజ్ఞప్తి చేశారు.

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం



ఆత్మకూరు: విద్యా రంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటాలు సాగిస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వీ నరేంద్ర పేర్కొన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఎస్ఎఫ్ఐ ఆత్మకూరు పట్టణ ప్లీనరీలో ఆయన మాట్లాడారు. అనంతరం పట్టణ నూతన అధ్యక్షుడుగా ఎస్‌కే ఖాదర్‌బాషా, కార్యదర్శిగా ఎన్ చక్రి, ఉపాధ్యక్షుడిగా శ్రీను, సహాయ కార్యదర్శులుగా కార్తీక్, భరణి, మనోజ్ ను ఎన్నుకున్నారు.

బడబాగ్నికి జాతీయ పురస్కారం



అల్లూరు: అల్లూరుకు చెందిన రంగస్థల కళాకారుడు బడబాగ్ని ఆంజనేయరాజు జాతీయ స్థాయి పురస్కారాన్ని అందుకున్నారు. ఒంగోలులో జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఏకపాత్రాభినయ పోటీల్లో పెద్దోడు పాత్రను పోషించిన బడబాగ్ని ఆహుతులను మెప్పించి తృతీయ స్థానంలో నిలిచి పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బడబాగ్నిని అల్లూరువాసులు అభినందించారు.

హెల్మెట్‌ను విధిగా ధరించాలి

- సీనియర్ సివిల్ జడ్జి శోభ


అవగాహన కల్పిస్తున్న జడ్జి శోభ

కావలి : ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్‌ను ధరించాలని కావలి లోక్‌అదాలత్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి శోభ సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికారిక సంస్థ ఆదేశాల మేరకు కావలి న్యాయ సేవాధికారిక సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి శోభ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం మంది హెల్మెట్ ధరించక తలకు తీవ్ర గాయాలపాలై మృత్యువాత పడుతున్నారని తెలిపారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చన్నారు. మోటార్ వాహనాల చట్టప్రకారం హెల్మెట్ ధరించకపోవడం నేరమని తెలిపారు. హెల్మెట్ ధరించకపోతే అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్‌జడ్జి సుధాకర్‌రావు, ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ పరుశురామన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, కార్యదర్శి జయప్రకాష్, లోక్ అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగిఉండాలి


అవగాహన కల్పిస్తున్న హెల్త్‌ఎడ్యుకేటర్ వెంకటసుబ్బయ్య

ఉదయగిరి: సీజనల్ వ్యాధులైన డయేరియా, చికున్‌గున్యా, మలేరియా, డెంగీ, తదితర వ్యాధులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గండిపాళెం పీహెచ్‌సీ ఆరోగ్య బోధకుడు కలసపాటి వెంకటసుబ్బయ్య, మలేరియా ఉదయగిరి సబ్‌యూనిట్ అధికారి నౌషాద్‌బాబు అన్నారు. ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై శుక్రవారం వారు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలుషిత ఆహారం, నీరు తీసుకోవడం వల్ల డయేరియా వస్తుందన్నారు. నీళ్ల విరేచనాలు, అధిక దాహం, నీరసం వంటివి డయేరియా లక్షణాలని తెలిపారు. విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుబాటులో ఉంచిన ఓఆర్ఎస్ ద్రావణాన్ని ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. పరిసరాల, చేతుల శుభ్రత పాటించడం ద్వారా డయేరియాను అరికట్టవచ్చని తెలిపారు. ఎంఈఓ–2 తోట శ్రీనివాసులు, హెచ్‌ఎం బాలకేశవులు, ఉపాధ్యాయులు షరీఫ్, నారాయణ, ఆరోగ్యసిబ్బంది అరుణ్‌బాబు, నూర్జహాన్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల అభివృద్ధి


మాట్లాడుతున్న ఉదయకృష్ణ

సీతారామపురం: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల అభివృద్ధి సాధ్యమని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయకృష్ణ, పందిటి అంబేడ్కర్‌మాదిగ పేర్కొన్నారు. సీతారామపురంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులతో శుక్రవారం వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా మంద కృష్ణమాదిగ నాయకత్వంలో మాదిగలు పోరాటం సాగిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో సాధించుకునే సమయం ఆసన్నమైందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబునాయుడు సైతం ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపినందున, దాన్ని సాధించుకునేందుకు మాదిగ యువకులంతా ఎమ్మార్పీఎస్ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. నాయకులు కిరణ్, రాజేష్, తిరుపతయ్య, బాబు, సహదేవ్, ప్రభాకర్, ప్రసాద్, వినోద్‌ఖన్నా, తదితరులు పాల్గొన్నారు.

కుష్టు సర్వేను బాధ్యతగా చేపట్టాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ

వరికుంటపాడు: మండలంలో ఈ నెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు చేపట్టనున్న కుష్టు సర్వేను వైద్యాఆరోగ్య సిబ్బంది బాధ్యతగా నిర్వహించాలని ఎంపీడీఓ తోట వెంకటకృష్ణకుమారి, మండల వైద్యాధికారిణి కరీష్మా సూచించారు. వరికుంటపాడు పీహెచ్‌సీలో కుష్టు సర్వేపై వైద్యాఆరోగ్య సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతి ఇంటిని సందర్శించి సర్వే చేపట్టాలన్నారు. శరీరంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, కనుబొమ్మల్లో తేడాలు ఉండడం వంటివి కుష్టు లక్షణాలని తెలిపారు. అటువంటి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వారి వివరాలు సర్వే ఫారాల్లో నమోదు చేయాలన్నారు. సర్వేను నూరు శాతం పూర్తి చేసి కుష్టు రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ పీ రాజశేఖరరాజు, పీహెచ్ఎన్ఎం సుశీలమ్మ, ఆరోగ్య పర్యవేక్షకుడు వెంకటయ్య, సిబ్బంది రోజా, జానకి, ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


కాగితపు సంచులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సోమశిల: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్ అన్నారు. చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రపంచ కాగితపు సంచుల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి సహకారంతో విద్యార్థులు కాగితపు సంచులను తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్లాస్టిక్‌తో పర్యావరణం దెబ్బతింటోందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ పాలిథిన్ కవర్లకు బదులుగా వస్త్ర సంచులను వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీసీడబ్ల్యూఓ శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సంగం: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బుజ్జయ్య అన్నారు. నేను బడికిపోతా కార్యక్రమంలో భాగంగా సంగం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. హైస్కూల్ నుంచి బ్యాంకు వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఎంఈఓలు జానకీరాం, మల్లయ్య ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పనికి పంపకుండా పాఠశాలకు పంపి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని కోరారు.

సీసీఆర్ కార్డులతో బహుళ ప్రయోజనాలు

ఆత్మకూరురూరల్: పంట సాగు హక్కు పత్రాలతో(సీసీఆర్‌సీ) కౌలు రైతులకు బహుళ ప్రయోజనాలు లభిస్తాయని ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ పేర్కొన్నారు. మండలంలోని నువ్వూరుపాడు, బట్టేపాడు రైతుసేవా కేంద్రాల్లో శుక్రవారం గ్రామసభలను నిర్వహించారు. పంట సాగు హక్కు పత్రాలపై కౌలు రైతులకు అవగాహన కల్పించారు. రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకుని పత్రాలు పొందాలని సూచించారు. ఏఓ కిషోర్‌బాబు, నువ్వూరుపాడు సర్పంచ్ కటారి దొరసానమ్మ, బట్టేపాడు, నువ్వూరుపాడు వీఆర్వోలు బికారి సాహెబ్, రమణయ్య, వీఏఏలు శ్రీపవల్లిక, ఝాన్సీరాణి, తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం: మండలంలోని మారంరెడ్డిపల్లి, పబ్బులేటిపల్లి రైతుసేవా కేంద్రాల్లో సీసీఆర్ కార్డుల పంపిణీపై గ్రామసభలు నిర్వహించారు. వీఏఏలు సీసీఆర్ కార్డుల ప్రయోజనాలను కౌలు రైతులకు వివరించారు. పంటరుణాలు, బీమా, పంట నష్ట పరిహారం వంటి ప్రయోజనాలను పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు భారతి, ఆదెయ్య, వీఏఏలు,వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

సోమశిల: మండల కేంద్రమైన అనంతసాగరంలోని రెండు సచివాలయాల్లో వ్యవసాయాధికారి శ్రీనివాస్ చక్రవర్తి ఆధ్వర్యంలో కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రంపై అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ పంటసాగు పత్రం ద్వారా కౌలు రైతులకు అందే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమాల్లో వీఏఏలు యశోద, షేక్ మైమున్నీ సా, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.